

నేడు సీఎం జగన్ రాక



విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నగరానికి రానున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మధ్యాహ్నం 4.25 గంటలకు హెలికాప్టర్‌లో ఆర్కే బీచ్‌రోడ్డులోని నేవల్ కోస్టల్ బ్యాటరీకి చేరుకుంటారు. అక్కడి నుంచి ఏయూ కన్వెన్షన్ హాల్‌లో జరిగే డీసీసీబీ ఛైర్మన్, నగర వైసీపీ అధ్యక్షుడు కోలా గురువులు కుమారుడి వివాహానికి హాజరవుతారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన తర్వాత సాయంత్రం ఐదు గంటలకు ఎయిర్‌పోర్టుకు వెళతారు. 5.20 గంటలకు విమానంలో విజయవాడ వెళ్లిపోతారు.

దేశాన్ని విభజించేందుకు రాజకీయ కుట్రలు

- ఏపీలో పెరిగిన బీజేపీ ఓటు బ్యాంకు
- కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్


ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఓటు బ్యాంకు పెరిగిందని, తప్పకుండా ఏదో ఒకరోజు ఇక్కడ కూడా అధికారంలోకి వస్తామని ఆ పార్టీ నాయకులు, కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో పలు వర్గాలతో మంగళవారం బీజేపీ నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

- వివరాలు మెయిన్ ఎడిషన్‌లో



రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సత్కరిస్తున్న బీజేపీ సానుభూతిపరులు

భువనేశ్వరికి ఘన స్వాగతం



విమానాశ్రయంలో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 27: ఉత్తరాంధ్ర జిల్లాల్లో 'నిజం గెలవాలి' (చంద్రబాబునాయుడు అరెస్టు కావడాన్ని తట్టుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఓదార్పు) కార్యక్రమం నిర్వహణ కోసం మంగళవారం నగరానికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 12 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దంపతులు, పార్టీ విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు బయలుదేరి వెళ్లారు.

నేడు మంత్రి రోజా రాక

- రుషికొండపై నిర్మించిన సీఎం క్యాంపు కార్యాలయాన్ని రేపు ప్రారంభించనున్నారని ప్రచారం?



విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి రోజా బుధవారం నగరానికి వస్తున్నారు. విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మన్ కోలా గురువులు కుమారుడి వివాహానికి ఆమె హాజరవుతారు. రాత్రికి నగరంలోనే నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. గురువారం ఉదయం బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్కు వద్ద పర్యాటక శాఖ వాహనాలను ప్రారంభిస్తారు. విశాఖపట్నం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఏర్పాటుచేసిన ప్యాకేజీ టూర్లలో భాగంగా వీటిని జెండా ఊపి ప్రారంభిస్తారు. అయితే రుషికొండపై రూ.450 కోట్లు వెచ్చించి నిర్మించిన సీఎం క్యాంపు కార్యాలయాన్ని కూడా ఆమె ప్రారంభించే అవకాశం ఉందని తెలిసింది. అక్కడ భారీ భవంతులన్నీ పర్యాటకుల వసతి పేరుతో పర్యాటక శాఖ నిర్మించిన సంగతి తెలిసిందే. అందుకే ఆ శాఖా మంత్రితో ప్రారంభింపజేస్తారని అంటున్నారు.

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా చంద్రమౌళి



- 6వ పేజీలో

మాక్ డ్రిల్లేనట!

ఫ్లోటింగ్ బ్రిడ్జిపై అధికారుల వాదన

- కావాలనే 'టి జంక్షన్ వ్యూ పాయింట్'ను దూరంగా తీసుకువెళ్లి లంగరు వేశారట
- ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత?
- అసలు అనుమతులే లేవు
- కానీ నిపుణులు చెప్పారని ప్రకటనలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి (అలలపై వంతెన)పై అధికారులు అసంబద్ధ వాదనలు చేస్తున్నారు. ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రారంభించిన 24 గంటలలోపే రెండుగా విడిపోయిన సంగతి తెలిసిందే. అయితే అధికారులు మాత్రం మాక్ డ్రిల్‌లో భాగంగానే 'టి జంక్షన్ వ్యూపాయింట్'ను దూరంగా తీసుకువెళ్లి లంగరు వేశామని చెబుతున్నారు. ఈ విషయంలో మీడియా దుష్ప్రచారం చేస్తున్నదని ఆరోపిస్తున్నారు.



టి-జంక్షన్ వ్యూపాయింట్‌ను బ్రిడ్జికి జతచేసిన దృశ్యం

ఇవన్నీ పక్కన పెడితే...ఆ ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేసుకోవచ్చునని నిపుణులు సూచించారని కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున మంగళవారం కూడా మరోసారి ఉద్ఘాటించారు. ఆ నిపుణులు ఎవరో, ఏమని నివేదిక ఇచ్చారో వెల్లడించడం లేదు. ఆ ప్రాజెక్టుకు పర్యాటక శాఖ నుంచి అనుమతి ఎప్పుడు వచ్చిందో కూడా చెప్పడం లేదు. కురుసుర సబ్‌మెరైన్ ఏరియా అంతా అత్యంత ప్రమాదకరమైనది. అక్కడ ఈతకు దిగకూడదని జీవీఎంసీ అధికారులే హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలో బలమైన అలలు తాకడం వల్ల తీరం తరచూ కోతకు గురవుతుంటుంది. ఈ విషయం విశాఖపట్నం పోర్టు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు అందరికీ తెలుసు. అటువంటిచోట సముద్రంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి పెట్టారు. పౌర్ణమి కారణంగా సముద్రం పోటు వల్ల కెరటాలు పెద్దగా వస్తున్నాయని, అందుకే పర్యాటకులను అనుమతించడం లేదని చెబుతున్నారు. పౌర్ణమి రోజులని తెలిసీ ప్రాజెక్టును ఆదివారం ప్రారంభించాల్సిన అవసరం ఏమిటి?...అలాగే సోమవారం నుంచి పర్యాటకులను అనుమతిస్తామని ప్రకటించి, ఆ సమయంలో 'టి జంక్షన్ వ్యూ పాయింట్'ను విడిగా తీసుకువెళ్లి లంగరు వేయడం ఏమిటి?, దానికి మళ్లీ మాక్ డ్రిల్ అని చెప్పడం ఏమిటి?...ఇలాంటి వ్యవహారాలన్నీ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే చూసుకోవాలి గదా. అధికారికంగా, అట్టహాసంగా ప్రారంభించి, ఆ మరుసటిరోజు నుంచి పర్యాటకులను అనుమతిస్తామని చెప్పి...

... మిగతా 6వ పేజీలో

యువతి కిడ్నాప్‌నకు యత్నం

- ఒంటరిగా ఆటో ఎక్కిన యువతిని అపహరించేందుకు డ్రైవర్ యత్నం
- భయంతో ఆటో నుంచి దూకేసిన యువతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఒక యువతిని కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశాడో ఆటో డ్రైవర్. తాను దిగాల్సిన చోట ఆపకుండా డ్రైవర్ ముందుకు తీసుకువెళ్లిపోతుండడంతో ఆందోళనకు గురై ఆమె ఆటో నుంచి కిందకు దూకేసింది. స్వల్పగాయాలైన యువతిని ఆమె స్నేహితులు విమ్స్‌లో చేర్పించారు. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మద్దిలపాలెం సమీపంలోని క్రాంతినగర్‌కు చెందిన కొల్లూరు లహరి (26) సంగం-శరత్ సమీపంలోని ఒక ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో పనిచేస్తోంది. సోమవారం విధులకు వెళ్లిన లహరి మధ్యాహ్న సమయంలో షోరూమ్ నుంచి ఆరిలోవలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. కొత్త మోడల్ వాహనాన్ని లాంచింగ్ చేయాల్సి ఉన్నందున వేగంగా షోరూమ్‌కు రావాలంటూ లహరికి సిబ్బంది ఫోన్ చేశారు. దీంతో సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆమె ఆరిలోవ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. అక్కడకు షోరూమ్ ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. అయితే షోరూమ్ సిబ్బంది చెప్పిన సమయం దాటిపోతుండడంతో అక్కడ నుంచి మరో ఆటో ఎక్కింది. డ్రైవర్ ఆటోలోని అద్దం నుంచి తదేకంగా వెనుక సీట్లో కూర్చున్న లహరిని చూడడం, నవ్వుతూ మాటలు కలపడంతో అతని వ్యవహారశైలిపై ఆమెకు అనుమానం వచ్చింది. అదే సమయంలో షోరూమ్ రావడంతో ఆటో ఆపాలని లహరి కోరింది. అయినా ఆటో ఆపకుండా ముందుకుపోనివ్వడంతోపాటు 'నిన్ను గాజువాక తీసుకువెళతాను. అక్కడ మంచి పార్టీ ఉంది. వారికి అప్పగిస్తాను' అని చెప్పడంతో ఆందోళనకు గురైన ఆమె రైల్వే ఆస్పత్రి సమీపంలో వెళుతున్న ఆటో నుంచి కిందకు దూకేసింది. ఈ ఘటనలో బాధితురాలికి ముఖంపై గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ ఆటోను ఆపాడు. బాధితురాలు తన ఫోన్ నుంచి స్నేహితులకు ఫోన్ చేయడంతో వారంతా వచ్చి ఆమెను సమీపంలోని రైల్వే ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విమ్స్‌కు తరలించారు. ఆటో డ్రైవర్ అక్కడ నుంచి వెళ్లిపోగా, బాధితురాలి స్నేహితులు సెల్‌తో ఆటోతోపాటు డ్రైవర్ ఫొటోలు తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ కోసం గాలించారు. గాజువాకలోని బీసీ రోడ్డుకు చెందిన శాంతికృష్ణగా గుర్తించారు. పాతగాజువాక ఆటోస్టాండ్‌లో సర్వీసు చేస్తుంటాడని టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపారు. కృష్ణను అదుపులోకి తీసుకుని విచారించామని, తాను యువతిని కిడ్నాప్ చేస్తానని అనలేదని, షోరూమ్ దాటిపోతోందని ఆమె చెప్పడంతో సడన్‌గా ఆటోను ఆపకూడదు కాబట్టి కొంచెం పక్కకు తీసి ఆపే ప్రయత్నంలో ఉండగా...ఆమె హఠాత్తుగా కిందికి దూకేసిందని చెబుతున్నాడన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉక్కులో ఉద్రిక్తత



ప్లాంట్ డైరక్టర్ పర్సనల్ ఎస్‌సి పాండే కార్యాలయంలో నేలపై పడుకున్న ఉక్కు కార్మిక నాయకులు

బయోమెట్రిక్ అమలుపై వివాదం

- తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్
- వచ్చే నెల 8వ తేదీ నుంచి అమలు చేస్తామంటూ యాజమాన్యం ఉత్తర్వులు
- పర్సనల్ డైరెక్టర్ ఛాంబర్‌లో బైఠాయించిన సంఘ నాయకులు
- అడ్మిన్ భవనం వద్ద కార్మికుల ధర్నా
- రాత్రి 12 గంటలకు కూడా కొనసాగుతున్న నిరసన కార్యక్రమం

ఉక్కు టౌన్‌షిప్, ఫిబ్రవరి 27: స్టీల్‌ప్లాంటులో బయోమెట్రిక్ అమలుపై వివాదం తలెత్తింది. తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే బయోమెట్రిక్ అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు మంగళవారం డైరెక్టర్ (పర్సనల్) ఛాంబర్‌లో ఆందోళనకు దిగారు. ప్లాంటులో బయోమెట్రిక్ ఏర్పాటుపై యాజమాన్యం ఈ నెల 24న కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు బయోమెట్రిక్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే కార్మికుల వేతన సవరణ, క్యాంటీన్, భద్రత పరిస్థితులు మెరుగు వంటి సమస్యలను పరిష్కరించాక అమలు చేయాలని డిమాండ్ చేశారు. అయితే నాయకుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా యాజమాన్యం మార్చి ఎనిమిది నుంచి బయోమెట్రిక్ అమలు చేస్తున్నట్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కార్మిక నాయకులు మంగళవారం సాయంత్రం అడ్మిన్ బిల్డింగ్‌లోని డైరెక్టర్ ఛాంబర్‌కు వెళ్లి బయోమెట్రిక్ అమలు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో అక్కడే బైఠాయించారు. ఈ విషయం తెలిసిన కార్మికులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని గేటు వద్దే

... మిగతా 6వ పేజీలో



ప్రశాంతంగా టెట్

- తొలిరోజు 86.8 శాతం హాజరు

ఆరిలోవ, ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. మంగళవారం నగరంలోని ఏడు కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. తొలిరోజు పరీక్షకు 4,420 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా...3837 (86.8 శాతం) మంది హాజరయ్యారు. 583 మంది మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ పలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఫైర్ సేఫ్టీ నిల్

గాజువాక ఆకాష్-బైజూస్ అకాడమీలో అగ్నిప్రమాదం

- మంటలు వెంటనే అదుపులోకి రాకపోవడానికి భవన యజమాని నిర్లక్ష్యమే కారణం
- అగ్నిమాపక నివారణ పరికరాలు మరమ్మతు చేయించాలన్న అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- ఐదు నెలలైనా పట్టించుకోని వైనం
- అందుకే ఎన్‌ఓసీ కూడా ఇవ్వని వైనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గాజువాకలో మంగళవారం సంభవించిన భారీ అగ్ని ప్రమాదానికి భవన యజమాని నిర్లక్ష్యమే కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. జీ+4 తరహాలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో నగల దుకాణంతో పాటు బైజూస్-ఆకాష్ అకాడమీ, ఒక హోటల్ నడుస్తున్నాయి. రెండో ఫ్లోర్‌లో గల ఆకాష్ బైజూస్ అకాడమీలో ప్రమాదం సంభవించింది. చుట్టుపక్కల భవనాలకు, కింద ఉన్న వైభవ్ జ్యూవెలర్స్‌కు, పైన ఉన్న మూడు, నాలుగు అంతస్థులకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది చూడగలిగారు. అగ్ని ప్రమాద నివారణకు భవన నిర్మాణ సమయంలో యజమాని తగిన ఏర్పాట్లు చేశారు. పదిహేను మీటర్లు కంటే తక్కువ ఎత్తు కలిగిన భవనం కావడంతో జీవీఎంసీ ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్

... మిగతా 6వ పేజీలో



ప్రమాదంలో దగ్ధమైన సామగ్రి



కళాశాల నడుస్తున్న ఫ్లోర్ నుంచి ఎగసిపడుతున్న మంటలు

సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

అల్లిపురం, ఫిబ్రవరి 27: ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షునిగా జీఎస్‌జే అచ్యుతరావు, అధ్యక్షునిగా మణికంఠ, కార్యదర్శిగా సీహెచ్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎఎస్ మధు, నిర్వాహక కార్యదర్శిగా జి.సురేష్, సమాచార కార్యదర్శిగా జి.శ్రీనులు ఎన్నికయినట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీవీ మంజునాథ ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


జామెట్రికల్ సిటీ ప్రాజెక్టు నమూనాను వివరిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, ఫిబ్రవరి 27 : స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలోని న్యూటన్ పబ్లిక్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. జామెట్రికల్ సిటీ, చంద్రయాన్-4, ట్రాఫిక్ నియమాలు, సోలార్ విద్యుత్ తయారీ, వివిధ రకాల కాలుష్యం- నివారణా మార్గాలు తదితర ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. స్కూల్ కరస్పాండెంట్ బి.మిథు మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీయవచ్చునన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులున్నారు.

సత్యదేవుడికి రూ.25 లక్షల విలువైన ఆభరణాలు, నగదు విరాళం


అజ్ఞాత భక్తుడు అందించిన ఆభరణాలు

అన్నవరం, ఫిబ్రవరి 27: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి మంగళవారం విశాఖపట్నంనకు చెందిన అజ్ఞాత భక్తుడు స్వామి, అమ్మవార్లు, శంకరుడికి రూ.17.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నిత్యాన్నదాన పథకానికి రూ.5లక్షలు, గోసంరక్షణ ట్రస్ట్‌కు రెండులక్షలు విరాళంగా అందించారు. వీటిని ఆయన ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో కృష్ణారావుకు అందించగా వారు దాతను అభినందించి ప్రత్యేక దర్శనం స్వామివారి ప్రసాదాలు అందించారు. సూపరింటెండెంట్‌లు భాస్కర్, స్వామీజీ, ఏపీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

పెందుర్తిలో పోటీ చేస్తా...: కాపునాడు నేత

సీతమ్మధార, ఫిబ్రవరి 27: తన రాజకీయ జీవితం నలభై ఏళ్లుగా సాగుతోందని, ఈ స్థితిలో తనకు వైసీపీ తగిన గుర్తింపు ఇవ్వలేడంలేదని ఆపార్టీ నాయకుడు, విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాపునాడు నేత గుంటూరు నరసింహరావుఆవేదన వ్యక్తంచేశారు. సీతమ్మధారలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెందుర్తిలో నియోజక వర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే అదీప్ రాజ్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని,ఈ స్థితిలో టికెట్ తనకు కేటాయించాలని ఆయన అధిష్టానాన్ని కోరారు. లేదా స్థానికనేత అమర్‌నాథ్‌కు అయినా కేటాయించాలన్నారు. ఇలా కాకుండా వేరెవరికి ఇచ్చినా వైసీపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని నరసింహరావు పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గంలో కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నియోజకవర్గంలో కేకే రాజుకిని సీటు ఇస్తే ఓటమి ఖాయమన్నారు. ఈ నియోజకవర్గలో కూడా అభ్యర్థిని మారిస్తే పార్టీ గెలుస్తుందన్నారు.

నీలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

అల్లిపురం,ఫిబ్రవరి 27: అల్లిపురం శ్రీ నీలమ్మవేప చెట్టు అమ్మవారి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కించారు. రెండు నెలలకు గాను రూ. 1,15,257 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రమాబాయి తెలిపారు. ప్రత్యేక అధికారి పద్మావతి, ఆలయ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి సమక్షంలో శ్రీహరి సేవకులు ఈ లెక్కింపు చేపట్టారు. ధర్మకర్తలులక్ష్మీకాంతం, చంద్రకళ ఉన్నారు.


అబిద్‌నగర్‌లో ఇనుప ఊచలు వేసి వదిలేసిన డ్రైనేజీ


నిర్మాణం చేస్తున్న డ్రైనేజీలో చేరిన మురుగు నీరు

నత్తనడకన డ్రైనేజీల నిర్మాణ పనులు

- గ్రేటర్ 44వ వార్డు అబిద్ నగర్‌లో తవ్వకాలు చేపట్టి వదిలేసిన వైనం
- రాకపోకలకు స్థానికులు ఇక్కట్లు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 27: గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్‌లో డ్రైనేజీల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా పనులు చేస్తున్నా పనులు మాత్రం ప్రారంభ దశలోనే దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలు నిర్మాణం కోసం రహదారిని తవ్వి వదిలేయడంతోపాటు ఇనుప ఊచలు యథాతథంగా కనిపిస్తున్నాయి. దీంతోపాటు పరిసర నివాసితుల ఇళ్లలోని వాడుక నీరంతా తవ్వకాలు చేసిన గోతుల్లో నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా అటువైపు నడవడానికి వీలు కుదరడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రైనేజీలు నిర్మిస్తే మురుగు నీరు, వర్షపు నీరు నిలిచిపోకుండా ఉంటుందని భావించారు. తీరా, అసంపూర్తి పనులతో లక్ష్యం నెరవేరలేదు. అంతే కాకుండా కొద్ది రోజులు పని చేసి మధ్యలో వదిలేస్తున్నారు. దీంతో రోడ్డుపై నిర్మాణ సామగ్రితో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారికి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,ఇలా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడంలేదంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీఎంహెచ్‌వోకు వినతి ఇస్తున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు

సీతంపేట, ఫిబ్రవరి 27: తమను రెగ్యులర్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు వివిధ కేడర్‌లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్ ఆప్తలమిక్ అసిస్టెంట్లు, లాబ్ టెక్నీషియన్స్ వినతి పత్రమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్టు తమకూ పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, అధికారులను కోరారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు సానుకూలంగా స్పందించి పై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రెసిడెంట్ శశిభూషణ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్ సరేశ్, సెక్రటరీ వీరబ్రహ్మం, గోపీనాథ్, నాగరాజు, సత్యనారాయణ, కె.వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిమయంగా వైసీపీ పాలన

- ఉత్తర జనసేన కన్వీనర్ ఉషాకిరణ్


జ్యోతినగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న కన్వీనర్ ఉషాకిరణ్

మద్రిపాలెం, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందని, అక్రమాలు పెరిగిపోయాయని ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. మంగళవారం 54వ వార్డులో వార్డు జనసేన అధ్యక్షుడు వింజమూరి భాస్కర్ అధ్వర్యంలో నిర్వహించిన జనంలోకి జనసేన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి జనసేన పార్టీ ఆశయాలతోకూడిన కరపత్రాలను మహిళలకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఏ మాత్రం అభివృద్ధికి నోచుకో లేదన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్, అభివృద్ధితోపాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. జనసేన నాయకులు దివాకర్, సీతారాం, సురేంద్ర, నవీన్, వాసు, స్వర్ణలత, టీడీపీ వార్డు అధ్యక్షుడు కార్తీక్ కుట్టా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లోను మార్చి 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 9న నిర్వహించదలచిన లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్పు చేసినట్టు వెల్లడించారు. శివరాత్రి, ఇతర సెలవు దినాల కారణంగా ఈ మార్పు చేశామన్నారు. కక్షిదారులు మార్పును గమనించాలని సూచించారు. 16న జరగనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.

కేజీహెచ్‌లో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్


కేజీహెచ్‌లో వైద్యాధికారులతో మాట్లాడుతున్న అభిషేక్

మహారాణిపేట, ఫిబ్రవరి 27: అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలని పాడేరు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదేశించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్‌ను సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనులు, విద్యార్థులను పరామర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాటాడుతూ వైద్యపరీక్షల నిర్వహణ, నాణ్యమైన మందులందించేందుకు ఐటీడీఏ సంపూర్ణ సహకారాలు అందిస్తుందన్నారు. వివిధ ఆరోగ్య సమస్య లతో 268 మంది విద్యార్థులను కేజీహెచ్‌కు రిఫర్ చేశామని, వారిలో 247 మంది పిల్లలు పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. 13 మంది పిల్లలు వైద్య సేవలు ఇంకా పొందుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో వైద్యసేవలందించినా ఎనిమిది మంది పిల్లలు దురదృష్టవశాత్తు మృత్యువాత పడినట్టు చెప్పారు. మరో ముగ్గురిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. చిన్నారులకు అవసరమైన శస్త్ర చికిత్సలు చేసేందుకు తిరుపతి పద్మావతి ఆసుపత్రి అధికారులతో చర్చించినట్టు వివరించారు. గిరిజ నులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని తెలిపారు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, ట్రైబల్ సెల్ వైద్యాధికారి సంపత్, వైద్యులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాలతో ఏసీఏ నాశనం: జనసేన



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 27: వైసీపీ నీచ రాజకీయాలతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను నిర్వీర్యం చేస్తున్నారని జనసేన నాయకులు పీతల మూర్తి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీమిండియా క్రికెటర్, ఆంధ్ర సీనియర్ పురుషుల జట్టులో కీలక ఆటగాడైన హనుమ విహారి ఆంధ్ర జట్టుకు గుడ్ బై చెప్పడమే కాకుండా భవిష్యత్తులో ఆంధ్ర తరపున ఆడేది లేదని బహిరంగ ప్రకటన చేయడం వైసీపీ నేతల తీరుకు అద్దం పడుతోందన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యనిర్వాహక కమిటీలో అధ్యక్షుడు నుంచి అటెండర్ వరకు వైసీపీ చెందినవారే ఉన్నారని ఆరోపించారు. దీంతో ప్రతిభ గల క్రికెటర్ల భవిష్యత్తును, రాష్ట్ర ప్రతిష్టను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి పూర్తిగా వైసీపీ కార్యకర్తగా వ్యవహరిస్తూ నిధులను అడ్డగోలుగా వైసీపీ రాజకీయ కార్యక్రమాలు ఖర్చు చేయడంతోపాటు అర్హత లేని ఆటగాళ్లను జట్టు చేర్చుతున్నారన్నారు. విహారికి మద్దతుగా జట్టులోని ఆటగాళ్లందరూ సంతకాలు చేసిన వినతిని బుట్టదాఖలు చేశారన్నారు. ఏసీఏలో జరుగుతున్న వాటిపై నిష్పక్షపాతమైన విచారణ జరిపాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ రంగంలోనూ రాజారెడ్డి రాజ్యాంగం

- క్రీడాకారుడు విహారికి అన్యాయంపై ట్విట్టర్‌లో గంటా ధ్వజం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 27: వైసీపీ నేతలు రాజారెడ్డి రాజ్యాంగాన్ని క్రికెట్ రంగంలోనూ అమలు చేస్తున్నారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డినుద్దేశించి ట్విట్టర్‌లో మంగళవారం మండిపడ్డారు. స్వయంకృషితో ఎదిగి ప్రతిభ కలిగిన క్రీడాకారులతో రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. ఒకవైపు పెట్టుబడులను పొరుగు రాష్ట్రాలకు తరిమేసి...రాష్ట్రంలో నిరుద్యోగం పెంచేశారని, మరోవైపు క్రీడాకారుల విషయంలోనూ ఇదే వైఖరి అలంభించడం సమంజసమేనా అని ఆయన ప్రశ్నించారు. క్రికెట్ క్రీడాకారుడు విహారికి తక్షణమే క్షమాపణ చెప్పి తిరిగి కెప్టెన్సీని అప్పగించి రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తోడ్పాడాలని డిమాండ్ చేశారు. విహారి కోనసీమనుంచి వచ్చి ఓ మ్యాచ్‌లో 302 నాటౌట్‌తో నిలిచిన గొప్ప ఆటగాడన్నారు. వైసీపీ నీచ రాజకీయాలలతో ఆయనను ఆంధ్రా జట్టు నుంచి వైదొలిగేలా చేశారని పేర్కొన్నారు. మొత్తం ఏసీఏని గుప్పెట్లోకి పెట్టుకొని అక్రమాలకు తెగబడుతోందని, అధికార దుర్వినియోగంతో హనుమ విహారిని కెప్టెన్సీ నుంచి తప్పించడం దారుణమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం లేని చోట ఉండలేనంటూ భవిష్యత్‌లో ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఆడనని విహారి చెప్పే దుస్థితికి తీసుకొచ్చారన్నారు. గతంలో అంబటి రాయుడు, ఇప్పుడు హనుమ విహారి దిగ్గజ ఆటగాళ్లను అవమానించడమే ఈ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని తెలిపారు. ఆంధ్ర రంజీ జట్టుకు ఎన్నో విజయాలు అందించిన హనుమ విహారి భవిష్యత్‌ను మీ రాజకీయ పెత్తనంతో కాలరాశారని పేర్కొన్నారు. విహారికి తక్షణమే క్షమాపణలు చెప్పి తిరిగి కెప్టెన్సీ ఇచ్చి క్రీడాభివృద్ధికి తోడ్పాడాలని డిమాండ్ చేశారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: వాల్తేరు డివిజన్ పరిధిలోని బ్రహ్మపూర్, నౌపడ సెక్షన్‌లో ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 29వతేదీన పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. ఆ రోజు భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) గంట 25 నిమిషాలు, హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) గంటా 15 నిమిషాలు, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ ఎ క్స్‌ప్రెస్ (12830) ఐదు గంటల 25 నిమిషాలు, విశాఖ-దిఘా ఎక్స్‌ప్రెస్ (22874) గంటా 45 నిమిషాలు, విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526) రెండు గంటలు ఆలస్యంగా నడుస్తాయన్నారు. అలాగే, పూరి-గుణుపూర్ ఎక్స్ ప్రెస్ (18417) మూడు గంటల 45 నిమిషాలు, గుణుపూర్- రూర్కెలా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18118) గంట 35 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతాయి. కామాఖ్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12552), ముంబై- భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (22802) రైళ్లను 20 నుంచి 30 నిమిషాలపాటు నియంత్రించనున్నారు. భద్రతను పెంపొందించడానికి చేపడుతున్న నిర్మాణ పనులకు ప్రయాణికులు సహకరించాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా చంద్రమౌళి

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) చైర్మన్‌గా సనపల చంద్రమౌళి నియమితులయ్యారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సనపల చంద్రమౌళి వైసీపీ ఆవిర్భావం నుంచి సేవలు అందిస్తున్నారు. మాధవధారకు చెందిన ఆయన గతంలో వార్డు వైసీపీ అధ్యక్షునిగా, ఉత్తర నియోజకవర్గం కన్వీనర్‌గా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ అధినాయకుల ఆదేశాల ప్రకారం త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 27: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఏఎస్ఆర్ నగర్, వైఎస్సార్ నగర్, చిట్టిబాబు కాలనీ, ఏపీ టిడ్కో ఇళ్ళు, సంతోషిమాత కాలనీల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అందుకోసం వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మురుగునీటితో అవస్థలు


సీతన్న గార్డెన్స్‌లో ఓ ఇంటి ఎదుట నిలిచిన మురుగు

మాధవధార, ఫిబ్రవరి 27; గ్రేటర్ 51 వార్డు మాధవధార్డులోని సీతన్న గార్డెన్స్‌లో ఓఇంటి ఎదుట ఏడు నెలలుగా కాలువ నీరు నిలిచిపోయి దుర్వాసన నెలకొంటోంది. ఇంటి ఎదుట ఉన్న కల్వర్టు దిగువగా ఉండడంతో కాలువలో నీరు నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సమీప ఇంటి యజమాని భాస్కరరావు, పరిసరాల్లో వారు పలు మార్లు వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. దోమలు వృద్ధి చెంది ఇళ్లల్లో కుటుంబ సభ్యులు వ్యాధుల బారిన పడుతున్నామని మొరపెట్టుకున్నారు. అయినా, సచివాలయ సిబ్బంది పట్టించుకోలేదు. కోట్ల రూపాయలతో కనీస నాణ్యత లేని రోడ్లు వేసుకుపోతున్న జీవీఎం ఇంజనీరింగ్ విభాగానికి గానీ, వార్డు శానిటరీ అధికారికి గానీ ఈ సమస్య పరిష్కారానికి మొగ్గు చూపడంలేదని వాపోతున్నారు. ఇకనైనా, అధికారులు క్షేత్రస్థాయి లో పర్యటించి చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మాక్ డ్రిల్లేనట!

... 5వ పేజీ తరువాయి

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని చెప్పడం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఈ ప్రాజెక్టు పర్యాటకులను ఆకట్టుకునేదే.. అందులో అనుమానం లేదు. కానీ సురక్షితమైన ప్రాంతంలో ఏర్పాటుచేయాల్సిన దానిని ప్రమాదాలు జరిగే చోట పెట్టడమే ఏమిటనే దానిపైనే అభ్యంతరాలన్నీ. ఎక్కడో ఓ చోట పెట్టేసి చేతులు దులిపేసుకోవాలని అన్నట్టుగానే ఉంది అధికారుల తీరు. పౌర్ణమి అని, అలల తీవ్రత అని ఈ ప్రాజెక్టును నెలకు ఎన్నిసార్లు మూసేస్తారో కూడా అధికారులు చెప్పాల్సి ఉంటుంది. అధికారులు పలు అంశాల్లో తప్పులను ఒప్పుకోకుండా సమర్థించుకోవడం నగర ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇందులో అత్యుత్సాహం లేదని నిరూపించుకోవాలంటే...ఈ ప్రాజెక్టును ఆర్‌కే బీచ్‌లో పెట్టాలని సూచించిన నిపుణులు ఎవరో చెప్పాలి. అధికారికంగా తీసుకున్న అనుమతులు ఏమిటో మీడియాకు వివరించాలి.

'ఉక్కు'లో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

అడ్డుకున్నారు. దీంతో కార్మికులు అడ్మిన్ గేటు వద్ద బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. గేటు బయట, డైరెక్టర్ ఛాంబర్ వద్ద నాయకులు, కార్మికులు నిరసన కొనసాగిస్తున్నారు. 42 ఏళ్ల ఉక్కు చరిత్రలో రాత్రి సమయంలో ఉద్యోగులు/కార్మికులు ధర్నాకు దిగడం ఇదే మొదటిసారి. డైరెక్టర్ (పర్సనల్) కార్యాలయం వద్ద ఆందోళన తెలియజేస్తున్న కార్మిక నాయకులకు మద్దతుగా ఉద్యోగులు (రాత్రి 'సి' షిఫ్టునకు వెళ్లేవారు) మెరుపు ధర్నాకు దిగారు. అదేవిధంగా 'బీ' షిఫ్టునకు వెళ్లిన ఉద్యోగులు రాత్రి 10.30 గంటలకు బయటకు వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. యాజమాన్యం స్పందించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. రాత్రి 12 గంటలకు కూడా ధర్నా కొనసాగుతూనే ఉంది. ఉక్కు సీఎండీ బయటకు ఒకటి చెప్పి, మరొకటి అమలు చేస్తున్నారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, జి.గణపతిరెడ్డి, బీఎంకే నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ నిల్

... 5వ పేజీ తరువాయి

ఎన్‌ఓసీ పొందారు. అయితే ఆ గడువు ఐదు నెలల కిందటే ముగిసింది. ఎన్‌ఓసీ రెన్యువల్ కోసం భవన యజమాని జీవీఎంసీ ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఒకరు అక్కడకు వెళ్లి భవనంలో అగ్ని ప్రమాద నివారణ వ్యవస్థతోపాటు మోటార్లు, స్మోక్ డిటెక్టర్లు, వాటర్ స్ప్రేయింగ్ వాల్వ్‌లతోపాటు ఇతర పరికరాల పనితీరును పరిశీలించారు. ఇంటర్నల్ ఫైర్ ఫైటింగ్ సిస్టమ్‌తోపాటు కొన్ని పరికరాలు సరిగా పనిచేయడం లేదని గుర్తించారు. దీంతోపాటు ఫైర్ ఫైటింగ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించడం, ప్రతి మూడు నెలలకు ఒకసారి మాక్ డ్రిల్ నిర్వహణ, పరికరాల పనితీరును తరచూ పరీక్షించేందుకు వీలుగా ఫైర్ సేఫ్టీ అధికారిని నియమించుకోవాల్సి ఉన్నా...అలా చేయకపోవడంతో ఎన్‌ఓసీ జారీకి నిరాకరించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. అన్నింటినీ సరిచేసిన తరువాతే ఎన్‌ఓసీ జారీచేస్తామని స్పష్టంచేశారు. కానీ ఎస్ఎఫ్ఓ హెచ్చరికలను భవన యజమాని తేలిగ్గా తీసుకున్నారు. తనిఖీకి వచ్చిన అధికారి సూచించిన రిమార్కులను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదాన్ని మొదట్లోనే కొంతమంది గుర్తించి భవన యజమానితోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ మంటలను సకాలంలో ఆర్పలేకపోయారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు వ్యాపించడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లడానికి కారణమైంది. అదే భవనంలో అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ పనిచేసి ఉంటే ప్రాథమిక దశలోనే మంటలను ఆర్పేందుకు వీలుండేదని అగ్నిమాపక శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపిన తర్వాత లోపాలు నిర్ధారణ అయితే భవన యజమానికి నోటీసులు జారీచేస్తామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.రేణుకయ్య తెలిపారు.

గంజాయి పట్టుబడిన వ్యవహారంలో ఇద్దరు ఏయూ విద్యార్థుల సస్పెన్షన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కలకలం రేపిన గంజాయి వ్యవహారంలో ఇద్దరు విద్యార్థులను అధికారులు సస్పెండ్ చేశారు. వర్సిటీలోని ఏడుగురు విద్యార్థుల నుంచి అనుమానిత ప్యాకెట్‌ను గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారంలో భాగస్వాములైన ఇద్దరు ఏయూ విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా వర్సిటీలోని పలు వసతిగృహాలను పోలీసులు సోమవారం రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు తనిఖీ చేశారు. వర్సిటీ అధికారుల అనుమతితో ఈ తనిఖీలు జరిగినట్టు చెబుతున్నారు.

దుర్గాలమ్మ గుడి ఉత్సవాలను సజావుగా జరిగేలా చూడాలి

- ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్


సమావేశంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష తదితరులు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 27: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి మహోత్సవాలను సజావుగా జరిగేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ ఆదేశించారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన మంగళవారం ఆలయం వద్ద సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మార్చి 7 వతేదీనుంచి 9 తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ జాతరకు సంబంధించి ఏర్పాట్లపై చర్చించారు. అమ్మవారి దర్శనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూర్ణామార్కెట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించాన్నారు. అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్, పారిశుధ్యం నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆలయ ఆవరణలో ఉత్సవాల రోజుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయశాఖ సహాయకమిషనర్ , ఉత్సవ కమిటీ అధికారి కె.శిరీష మాట్లాడుతూ, ఈ జాతర మహోత్సవాలు మార్చి 7 తేదీన పందిరిరాటతో ప్రారంభమవుతాయన్నారు. 8వ తేదీన శివరాత్రి పర్వదినం సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకుంటారన్నారు. క్యూల్లో మంచినీరు, ఇతర వసతుల కల్పనకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. 9 తేదీన దుర్గాలమ్మ జాతర మహోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. సమావేశంలో గుడి ఈవో శేఖర్‌బాబు, ధర్మకర్తలమండలి చైర్మన్ మల్లిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పుచ్చకాయలు

జోరందుకున్న పుచ్చకాయల విక్రయాలు

గోపాలపట్నం, ఫిబ్రవరి 27: ఎండ తీవ్రత పెరుగుతుండడంతో శీతల పానీయాల విక్రయాలతో పాటు పుచ్చకాయల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు, ఆరోగ్య రీత్యా మంచిది కాబట్టి అత్యధికులు పుచ్చకాయలు కొనుగోలుకు ఆసక్తి చూపుతుండడంతో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వీటిని దిగుమతి చేసుకుంటూ విక్రయాలు జరుపుతున్నామని పలువురు వర్తకులు తెలిపారు. రానున్న రోజుల్లో వీటి అమ్మవాలు మరింత అధికమవుతామని వారు పేర్కొంటున్నారు.

పెందుర్తి తహసీల్దార్ బదిలీ

పెందుర్తి, ఫిబ్రవరి 27: పెందుర్తి తహసీల్దార్ వెంకటరావుకు పద్మనాభం బదిలీ అయింది. ఆయన స్థానంలో పద్మనాభంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న బంగార్రాజు ఇక్కడకు వచ్చారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం నుంచి పెందుర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరావుకు నెల రోజులు కూడా కాకముందే ఇక్కడ నుంచి బదిలీ కావడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పార్కులో నాగుపాము కలకలం

సింధియా, ఫిబ్రవరి 27: సింధియా నేవీ ఏరియా అంజాన్ పార్కులో సోమవారం రాత్రి ఆరు అడుగుల నాగుపాము హల్‌చల్ చేసింది. ఇక్కడి స్టోర్ రూమ్‌లో రూమ్‌లో నుంచి శబ్దం వినిపించడంతో సిబ్బంది లోపలకు వెళ్లి చూడగా నాగుపాము కనిపించేసరికి వారు భయంతో బయటకు పరుగులు తీశారు. స్నేక్ క్యాచర్ నాగరాజుకు సమాచారం అందించడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని ఎంతో చాకచక్యంగా పామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పామును యారాడ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ఘనంగా గజ్జలమ్మ అమ్మవారి పండగ



మల్కాపురం, ఫిబ్రవరి 27: గ్రేటర్ 58వ వార్డు పరిధిలోని కుంచమ్మకాలనీలో రజక సామాజిక వర్గం ప్రజలు గజ్జలమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాదిరిగానే ఆనవాయితీ ప్రకారం ఈ పండగను చేపట్టారు. ఈ అమ్మవారికి రూపం ఉండదు. కేవలం గోడకు రెండు కత్తులను, కళ్లను ఏర్పాటు చేసి, వాటికి నిండుగా పసుపురాసి భక్తులు పూజలు చేశారు. ఈ రూపాన్నే భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పండగ సాగింది. కుంచమ్మకాలనీతో పాటు ఇతరాత్ర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చి గజ్జలమ్మకు పూజలు చేశారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

అగనంపూడి, ఫిబ్రవరి 27: ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన నిరుపేద అయిన గుదే అప్పలరాజు అనే వ్యక్తికి స్థానిక పద్మ మార్కండేయ సేవా సంఘం తరపున అధ్యక్షుడు కొలిపాక అప్పారావు మంగళవారం రూ.20 వేల నగదు, నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న అప్పలరాజుకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ముందుకు వచ్చిన సంఘం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జి.నరసింగరావు, బేతా హనుమంతరావు, వెంకటరమణ, గుదే సుశీల గజేంద్రరావు, పైడికొండ, లక్ష్మణరావు, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 32, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 28, క్యారెట్ 22, దొండకాయలు 32, బంగాళదుంపలు 21, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 65, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 42, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28 , కంద 64, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

రోడ్డుకు ఇరుపక్కలా వ్యర్థాలే..

పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారిలో పేరుకుపోయిన డెబ్రిస్, చెత్తాచెదారం

దుర్గంధంతో కూడిన ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రోడ్డు పక్కన కుప్పలుగా డెబ్రిస్

పెదగంట్యాడ, ఫిబ్రవరి 27: పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారికి ఇరుపక్కలా చెత్తాచెదారం, డెబ్రిస్ కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ జంక్షన్ నుంచి కొత్త దిబ్బపాలెం కూడలి వరకు సుమారు కిలోమీటరు పొడవున ఉన్న రోడ్డులో వ్యర్థాలు రోజుల తరబడి నిల్వ ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశ్రామికవాడలో ఉన్న సుమారు రెండు వందల పరిశ్రమలకు ఇదే ప్రధాన రహదారి. పెదగంట్యాడ, నెల్లిముక్కు, సిద్ధేశ్వరం, యాతపాలెం, వెంకన్నపాలెం, గాజువాక, తదితర ప్రాంతాల నుంచి పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు వెళ్లే కార్మికులతో పాటు ప్రజలు ఈ రోడ్డు గుండానే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు తెచ్చేందుకు, ఉత్పత్తులను తీసుకువెళ్లేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా వాహనాలను ప్రధాన రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తుంటారు. అయితే రోడ్డు పక్కన చెత్తాచెదారం, డెబ్రిస్ పెద్దఎత్తున ఉండడంతో దుర్గంధంతో కూడిన వాసనతో ఆయా వాహనాల డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. పెదగంట్యాడ నుంచి యాతపాలెం, దిబ్బపాలెం, అశోక్‌నగర్, ప్రియదర్శనీకాలనీ, గిరిజా కాలనీ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు కూడా ఇదే రహదారిని వినియోగించుకుంటున్నారు. రోడ్డు పక్కన వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా మారిన ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు ఇంత దారుణంగా ఉన్నా ఇలా పాలకవర్గం కానీ జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



దారిపొడవునా పేరుకుపోయిన చెత్తాచెదారం

డెబ్రిస్, చెత్తాచెదారాన్ని తొలగించాలి



ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారికి ఇరుపక్కలా పేరుకుపోయిన డెబ్రిస్, చెత్తాచెదారాన్ని సత్వరమే తొలగించాలి. స్వచ్ఛ విశాఖ అంటున్న జీవీఎంసీ అధికారులు అధ్వానంగా మారిన ఈ రోడ్డు గురించి పట్టించుకోకపోవడం విచారకరం. పరిస్థితి ఇలాగే ఉంటే మరికొద్ది రోజుల్లో డెబ్రిస్ అంతా ప్రధాన రహదారిపైకి చేరుకునే అవకాశం ఉంది. అందువల్ల గ్రేటర్ అధికారులు, ఐలా పాలక వర్గ సభ్యులు దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కోరుతున్నాం.

-సంపంగి సూరిబాబు, యాతపాలెం

ఓటరు దరఖాస్తులో కచ్చిత సమాచారం ఉండాల్సిందే..

లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం

పోలింగ్ బూత్‌లలో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 27: ఓటరు దరఖాస్తు ప్రక్రియలో ప్రజలు ఫారమ్ 7, 8, 9లో కచ్చితమైన సమాచారం ఇవ్వకపోతే ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్-21 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ హెచ్చరించారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఫారమ్ 6, 7, 8 నమోదు ప్రక్రియలో తప్పుడు సమాచారమిస్తే సహించేది లేదన్నారు. ఈ విషయంలో ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే జీరో డోర్ నంబర్, ఒకే ఇంటి చిరునామాతో ఉన్న పది ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో కనీస వసతుల కల్పనపై దృష్టి సారించామన్నారు. బూత్‌ల వద్ద ర్యాంప్, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఒకే పోలింగ్ బూత్‌లో 1,500 పైగా ఓట్లు ఉంటే దానికి అదనంగా మరో రెండు బూత్‌లను ఏర్పాటు చేసేందుకు రాజకీయ పార్టీలకు సమాచారం ఇచ్చి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి శ్రీహరిపురంలో 111 బూత్‌కు సమీపంలో 111-ఏ బూత్‌ను, ఎన్ఏడీ దుర్గాపురంలోని 211 బూత్‌కు అదనంగా 211-ఏ బూత్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. మోడల్ పోలింగ్ స్టేషన్‌గా బుచ్చిరాజుపాలెంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ 59 బూత్‌కు వచ్చే ఓటర్లకు పువ్వులతో స్వాగతం పలికేలా చర్యలు చేపడతామన్నారు. గోపాలపట్నం బూత్ నంబర్-20ని మహిళా బూత్‌గా ఏర్పాటు చేసి అక్కడ అధికారులు, సిబ్బంది అంతా మహిళలే ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆర్డీవో పేర్కొన్నారు.

ఉక్కు రిలే నిరాహార దీక్షల కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 27: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షల ఉద్యమ కార్యాచరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంగళవారం ప్రకటించారు. ఇందులో భాగంగా మార్చి ఒకటిన ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, రెండున ఎఫ్ఎండీ, ఈఎండీ, ఈఎస్ఎండీ, ప్లాంట్ డిజైన్, మూడున కాంట్రాక్టు కార్మికులు (వైస్సార్‌టీయూసీ), నాలుగున డబ్ల్యూఆర్ఎం, ఐదున ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, ఆరున ఎస్ఎంఎస్-1, ఏడున సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఎంఈ, సీఈడీ, ల్యాబ్ అండ్ హైడ్రా, ఎనిమిదిన కోకో ఓవెన్, తొమ్మిదిన సింటర్ ప్లాంట్, పదిన కాంట్రాక్టు కార్మికులు (హెచ్ఎంఎస్) దీక్షా శిబిరంలో కూర్చుంటారు. అదేవిధంగా 11న బ్లాస్ట్ ఫర్నేస్, 12న ఎస్ఎంఎస్-2, 13న ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం, 14న ఓబీసీ అసోసియేషన్, 15న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 16న ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం, 17న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, 18న ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఏటీడీ, డీఎన్‌డబ్ల్యూ, ఆర్అండ్‌డీ, డీఅండ్ఈ, టెలికాం, ఈటీఎల్, డీఎన్‌డబ్ల్యూ, 19న ఈఎస్అండ్ఎఫ్, ఆర్ఎస్అండ్ఆర్ఎస్, ఈఆర్ఎస్, భద్రత, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో, 20న ఎస్ఎంఎస్-1 కార్మికులు దీక్షల్లో పాల్గొంటారు. కాగా 21న డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్ అడ్మిన్, టీటీఐ, 22న టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం, స్టోర్స్, ఎస్ఎండీ, 23న సింటర్ ప్లాంట్, 24న కాంట్రాక్టు కార్మికులు (ఏఐటీయూ), 25న కోక్-ఓవెన్, 26న బ్లాస్ట్ ఫర్నేస్, 27న ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్, 28న ట్రాఫిక్, కనస్ట్రక్షన్స్, ఆర్ఎండీ, 29న ఎస్ఎంఎస్-2, 30న ఎఫ్ఎండీ, ఆర్ఎస్ఆర్ఎస్, ప్లాంట్ డిజైన్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్, 31న కాంట్రాక్టు కార్మికులు (ఇంటక్) రిలే నిరాహార దీక్షల్లో కూర్చుంటారని పేర్కొన్నారు.

ఉద్యమానికి సీఎం నాయకత్వం వహించాలి

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి సీఎం జగన్ నాయకత్వం వహించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం బాగుంటేనే రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి సాధిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. నాయకులు నమ్మి సింహాద్రి, రఘు, లోకేశ్, వెంకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బధిర విద్యార్థులతో అడిషనల్ డీజీపీ ముఖాముఖి

పెందుర్తి, ఫిబ్రవరి 27: మండలంలోని ఎస్ఆర్‌పురంలో ఉన్న ప్రియదర్శిని సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న దివ్యాంగుల బధిర పాఠశాల, కళాశాలను మంగళవారం అడిషనల్ డీజీపీ రవిశంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగ సురక్షపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. విద్యాభ్యాసన, సైన్ లాంగ్వేజీ గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు సైగలతో ఒకరికొకరు సంభాషించడం చూసి ఆశ్చర్యచకితులయ్యారు. దిశా దివ్యాంగ సురక్ష టోల్‌ఫ్రీ నంబర్ 7337434422 ద్వారా ఆపదలో ఉన్న దివ్యాంగులు వీడియో కాల్ లేదా సందేశం ద్వారా పోలీసులను సంప్రదిస్తే తక్షణ సహాయ చర్యలు తీసుకుంటామన్నారు. బధిరల సౌకర్యార్థం సైన్ లాంగ్వేజ్‌లో నిపుణులైన వారిని కమాండ్ కంట్రోల్ విభాగంలో నియమించామన్నారు. అనంతరం ఆయన సైన్ లాంగ్వేజ్ నిపుణురాలితో సమీక్షించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. విద్య, వైద్యం, వసతి,భద్రత అంశాలపై ఆరా తీశారు. తక్షణ సహాయం కోసం డయల్ యువర్ సీపీ 0891-2523408 ఫోన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.



విద్యార్థులతో అడిషనల్ డీజీపీ రవిశంకర్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 27: కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. 87వ వార్డు పరిధి కణితి పీహెచ్‌సీలో మంగళవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పేదలు, రైతులు, యువజనులు, మహిళలు సాధికారత సాధించినప్పుడే భారత్ నిజమైన సాధికారత సాధించినట్టవుతుందన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చేయడమే ఈ యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం డిజిటల్ స్క్రీన్‌పై ప్రధాని మోదీ ప్రసంగాన్ని అందరూ వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మరాజు సోంబాబు బొండా ఎల్లాజీ, శ్రీదేవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమాజం గణనీయమైన ప్రగతి సాధిస్తుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పెదగంట్యాడ జంక్షన్‌లో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ మహిళలు, పేదల అభ్యున్నతి కోసం పీఎం మోదీ ఉజ్వల యోజన, ముద్ర యోజన, ఆవాస్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, జన్-ధన్ యోజన, తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిలాని ముసలయ్య, జి.ఎరుకునాయుడు, గురప్ప, సత్యనారాయణ, గూటూరు శంకరరావు, ఎల్లాజీరావు, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

సాంకేతిక రంగంలో విద్యార్థులు రాణించాలి

అగనంపూడి, ఫిబ్రవరి 27: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణించాలని ఇండస్ట్రియల్ ఏరియా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు పి.భాస్కరరావు అన్నారు. 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్‌లో మంగళవారం జాతీయ సైన్స్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనా ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కేవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 27: త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం సూచించారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు చేపట్టవలసిన సులభతరమైన విధానాలను వివరించారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బొండా జగన్

'టీడీపీ-జనసేనతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిత'

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 27: టీడీపీ-జనసేన కూటమితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తకు కూడా న్యాయం జరగలేదని, గుర్తింపు లేదన్నారు. అంతా వలంటీర్లమయమేనన్న ఆవేదనతో ఎంతోమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి వచ్చేందుకు క్యూ కడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి గెలుపు ఖాయమని తెలియడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన మొదలైందన్నారు. సీఎం జగన్ నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలన్నదే చంద్రబాబు-పవన్‌కల్యాణ్‌ల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, ఎస్.పెంటారావు, కె.శ్రీనివాసవర్మ, సత్తిబాబు, వి.రాంబాబు, డీవీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో టెట్ ప్రారంభం



అభ్యర్థి హాల్ టికెట్ పరిశీలిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 27: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రారంభమైన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) షీలానగర్ అయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో ఆరంభమయ్యాయి. పరీక్షలకు గంట ముందుగానే అభ్యర్థులు హాజరు కావాలని ప్రకటించడంతో అందరూ ఉదయం ఏడు గంటల నుంచే రావడం ప్రారంభించారు. పలువురు మహిళలు తమ భర్త, పిల్లలతో పరీక్షలు రాసేందుకు రావడంతో అయాన్ కేంద్రం బయట సందడి వాతావరణం నెలకొంది. అభ్యర్థులను కేంద్రం సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశాక లోపలకు అనుమతిచ్చారు. ఈ కేంద్రంలో పరీక్షలు రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: బుచ్చిరాజుపాలెంలోని ఎరాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో టెట్‌ను ఉదయం, మధ్యాహ్నం నిర్వహించారు. అభ్యర్థులతో పాటు వచ్చిన కుటుంబ సభ్యులు ఇక్కడి డబుల్ రోడ్డులో ఉన్న చెట్ల కింద, అపార్టుమెంట్ల ముందు సేదదీరారు.

శ్రీశైల బ్రహ్మోత్సవాలకు శారదా పీఠాధిపతికి ఆహ్వానం

పెందుర్తి, ఫిబ్రవరి 27: శివరాత్రి సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించున్న బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కావాలని కోరుతూ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని ఆహ్వానించారు. మంగళవారం చినముషిడివాడలోని శారదాపీఠాన్ని శ్రీశైల ఆలయ వర్గాలు సందర్శించి పీఠాధిపతికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో హెచ్‌బీఎల్ ప్రతినిధులు, తదితరులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 27: విద్యార్థులను చిన్ననాటి నుంచి దేశం పట్ల, తల్లిదండ్రులు, గురువులపై గౌరవ భావం కలిగేలా తీర్చిదిద్ది వారిని భావిభారత పౌరులుగా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని వీఎస్ఈజెడ్-హెచ్‌బీఎల్ ప్రతినిధులు విజయలక్ష్మి, కృష్ణంరాజు పేర్కొన్నారు. 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు మంగళవారం హెచ్‌బీఎల్ భగీరథ బాలల వికాస కేంద్రం ఆధ్వర్యంలో పౌష్టికాహారం, వసతులు, పలు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు పలువురు దేశభక్తుల వేషధారణలో, వివిధ మతాలు, కులవృత్తుల వేషధారణలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ శ్రీకాంత్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలవేణి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

అల్లిపురం, ఫిబ్రవరి 27: ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షునిగా జీఎస్‌జే అచ్యుతరావు, అధ్యక్షునిగా మణికంఠ, కార్యదర్శిగా సీహెచ్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎఎన్ మధు, నిర్వాహక కార్యదర్శిగా జి.సురేష్, సమాచార కార్యదర్శిగా జి.శ్రీనులు ఎన్నికయినట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీవీ మంజునాథ ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



జామెట్రికల్ సిటీ ప్రాజెక్టు నమూనాను వివరిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, ఫిబ్రవరి 27 : స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలోని న్యూటన్ పబ్లిక్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. జామెట్రికల్ సిటీ, చంద్రయాన్-4, ట్రాఫిక్ నియమాలు, సోలార్ విద్యుత్ తయారీ, వివిధ రకాల కాలుష్యం- నివారణా మార్గాలు తదితర ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. స్కూల్ కరస్పాండెంట్ బి.మిథు మాట్లాడాతు.. ప్రాథమిక స్థాయి నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీయవచ్చునన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులున్నారు.

సత్యదేవుడికి రూ.25 లక్షల విలువైన ఆభరణాలు, నగదు విరాళం



అజ్ఞాత భక్తుడు అందించిన ఆభరణాలు

అన్నవరం, ఫిబ్రవరి 27: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి మంగళవారం విశాఖపట్నంకు చెందిన అజ్ఞాత భక్తుడు స్వామి, అమ్మవార్లు, శంకరుడికి రూ.17.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నిత్యాన్నదాన పథకానికి రూ.5లక్షలు, గోసంరక్షణ ట్రస్ట్‌కు రెండులక్షలు విరాళంగా అందించారు. వీటిని ఆయన ఆలయ ప్రదానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో కృష్ణారావుకు అందించగా వారు దాతను అభినందించి ప్రత్యేక దర్శనం స్వామివారి ప్రసాదాలు అందించారు. సూపరింటెండెంట్‌లు భాస్కర్, స్వామీజీ, ఏపీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

పెందుర్తిలో పోటీ చేస్తా...: కాపునాడు నేత

సీతమ్మధార, ఫిబ్రవరి 27: తన రాజకీయ జీవితం నలభై ఏళ్లగా సాగుతోందని, ఈ స్థితిలో తనకు వైసీపీ తగిన గుర్తింపు ఇవ్వలేదులేదని ఆపార్టీ నాయకుడు, విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాపునాడు నేత గుంటూరు నరసింహరావుఆవేదన వ్యక్తంచేశారు. సీతమ్మధారలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెందుర్తిలో నియోజక వర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఆదీప్ రాజ్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని,ఈ స్థితిలో టికెట్ తనకు కేటాయించాలని ఆయన అధిష్ఠానాన్ని కోరారు. లేదా స్థానికనేత అమర్‌నాథ్‌కు అయినా కేటాయించాలన్నారు. ఇలా కాకుండా వేరెవరికి ఇచ్చినా వైసీపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని నరసింహరావు పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గంలో కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నియోజకవర్గంలో కేకే రాజుకిని సీటు ఇస్తే ఓటమి ఖాయమన్నారు. ఈ నియోజకవర్గంలో కూడా అభ్యర్థిని మారిస్తే పార్టీ గెలుస్తుందన్నారు.

నీలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

అల్లిపురం,ఫిబ్రవరి 27: అల్లిపురం శ్రీ నీలమ్మవేప చెట్టు అమ్మవారి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కించారు. రెండు నెలలకు గాను రూ. 1,15,257 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రమాబాయి తెలిపారు. ప్రత్యేక అధికారి పద్మావతి, ఆలయ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి సమక్షంలో శ్రీహరి సేవకులు ఈ లెక్కింపు చేపట్టారు. ధర్మకర్తలులక్ష్మీకాంతం, చంద్రకళ ఉన్నారు.



అబిద్‌నగర్‌లో ఇనుప ఊచలు వేసి వదిలేసిన డ్రైనేజీ



నిర్మాణం చేస్తున్న డ్రైనేజీలో చేరిన మురుగు నీరు

నత్తనడకన డ్రైనేజీల నిర్మాణ పనులు

- గ్రేటర్ 44వ వార్డు అబిద్ నగర్‌లో తవ్వకాలు చేపట్టి వదిలేసిన వైనం
- రాకపోకలకు స్థానికులు ఇక్కట్లు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 27: గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్‌లో డ్రైనేజీల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా పనులు చేస్తున్నా పనులు మాత్రం ప్రారంభ దశలోనే దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలు నిర్మాణం కోసం రహదారిని తవ్వి వదిలేయడంతోపాటు ఇనుప ఊచలు యథాతథంగా కనిపిస్తున్నాయి. దీంతోపాటు పరిసర నివాసితుల ఇళ్లలోని వాడుక నీరంతా తవ్వకాలు చేసిన గోతుల్లో నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా అటువైపు నడవడానికి వీలు కుదరడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రైనేజీలు నిర్మిస్తే మురుగు నీరు, వర్షపు నీరు నిలిచిపోకుండా ఉంటుందని భావించారు. తీరా, అసంపూర్తి పనులతో లక్ష్యం నెరవేరలేదు. అంతే కాకుండా కొద్ది రోజులు పని చేసి మధ్యలో వదిలేస్తున్నారు. దీంతో రోడ్డుపై నిర్మాణ సామగ్రితో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారికి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,ఇలా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడంలేదంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌వోకు వినతి ఇస్తున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు

సీతంపేట, ఫిబ్రవరి 27: తమను రెగ్యులర్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు వివిధ కేడర్‌లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, పారామెడికల్ అప్తలమిక్ అసిస్టెంట్లు, లాబ్ టెక్నీషియన్స్ వినతి పత్రమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్టు తమకూ పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, అధికారులను కోరారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు సానుకూలంగా స్పందించి పై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రెసిడెంట్ శశిభూషణ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్ సరేశ్, సెక్రటరీ వీరబ్రహ్మం, గోపినాథ్, నాగరాజు, సత్యనారాయణ, కె.వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిమయంగా వైసీపీ పాలన

- ఉత్తర జనసేన కన్వీనర్ ఉషాకిరణ్



జ్యోతినగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న కన్వీనర్ ఉషాకిరణ్

మర్రిపాలెం, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందని, అక్రమాలు పెరిగిపోయాయని ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. మంగళవారం 54వ వార్డులో వార్డు జనసేన అధ్యక్షుడు వింజమూరి భాస్కర్ అధ్వర్యంలో నిర్వహించిన జనంలోకి జనసేన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి జనసేన పార్టీ ఆశయాలతోకూడిన కరపత్రాలను మహిళలకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఏ మాత్రం అభివృద్ధికి నోచుకో లేదన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్, అభివృద్ధితోపాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి అత్యధిక మెజారి టీతో గెలిపించాలన్నారు. జనసేన నాయకులు దివాకర్, సీతారాం, సురేంద్ర, నవీన్, వాసు, స్వర్ణలత, టీడీపీ వార్డు అధ్యక్షుడు కార్తీక్ కుట్టా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లోను మార్చి 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 9న నిర్వహించదలచిన లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్పు చేసినట్టు వెల్లడించారు. శివరాత్రి, ఇతర సెలవు దినాల కారణంగా ఈ మార్పు చేశామన్నారు. కక్షిదారులు మార్పును గమనించాలని సూచించారు. 16న జరగనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.

కేజీహెచ్‌లో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



కేజీహెచ్‌లో వైద్యాధికారులతో మాట్లాడుతున్న అభిషేక్

మహరాణిపేట, ఫిబ్రవరి 27: అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలని పాడేరు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదేశించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్‌ను సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనులు, విద్యార్థులను పరామర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాటాడుతూ వైద్యపరీక్షల నిర్వహణ, నాణ్యమైన మందులందించేందుకు ఐటీడీఏ సంపూర్ణ సహకారాలు అందిస్తుందన్నారు. వివిధ ఆరోగ్య సమస్య లతో 268 మంది విద్యార్థులను కేజీహెచ్‌కు రిఫర్ చేశామని, వారిలో 247 మంది పిల్లలు పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. 13 మంది పిల్లలు వైద్య సేవలు ఇంకా పొందుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో వైద్యసేవలందించినా ఎనిమిది మంది పిల్లలు దురదృష్టవశాత్తు మృత్యువాత పడినట్టు చెప్పారు. మరో ముగ్గురిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. చిన్నారులకు అవసరమైన శస్త్ర చికిత్సలు చేసేందుకు తిరుపతి పద్మావతి ఆసుపత్రి అధికారులతో చర్చించినట్టు వివరించారు. గిరిజ నులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని తెలిపారు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, ట్రైబల్ సెల్ వైద్యాధికారి సంపత్, వైద్యులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాలతో ఏసీఏ నాశనం: జనసేన



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 27: వైసీపీ నీచ రాజకీయాలతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను నిర్వీర్యం చేస్తున్నారని జనసేన నాయకులు పీతల మూర్తి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీమిండియా క్రికెటర్, ఆంధ్ర సీనియర్ పురుషుల జట్టులో కీలక ఆటగాడైన హనుమ విహారి ఆంధ్ర జట్టుకు గుడ్ బై చెప్పడమే కాకుండా భవిష్యత్తులో ఆంధ్ర తరపున ఆడేది లేదని బహిరంగ ప్రకటన చేయడం వైసీపీ నేతల తీరుకు అద్దం పడుతోందన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యనిర్వాహక కమిటీలో అధ్యక్షుడు నుంచి అటెండర్ వరకు వైసీపీ చెందినవారే ఉన్నారని ఆరోపించారు. దీంతో ప్రతిభ గల క్రికెటర్ల భవిష్యత్తును, రాష్ట్ర ప్రతిష్టను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి పూర్తిగా వైసీపీ కార్యకర్తగా వ్యవహరిస్తూ నిధులను అడ్డగోలుగా వైసీపీ రాజకీయ కార్యక్రమాలు ఖర్చు చేయడంతోపాటు అర్హత లేని ఆటగాళ్లను జట్టు చేర్చుతున్నారన్నారు. విహారికి మద్దతుగా జట్టులోని ఆటగాళ్లందరూ సంతకాలు చేసిన వినతిని బుట్టదాఖలు చేశారన్నారు. ఏసీఏలో జరుగుతున్న వాటిపై నిష్పక్షపాతమైన విచారణ జరిపాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ రంగంలోనూ రాజారెడ్డి రాజ్యాంగం

- క్రీడాకారుడు విహారికి అన్యాయంపై ట్విట్టర్‌లో గంటా ధ్వజం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 27: వైసీపీ నేతలు రాజారెడ్డి రాజ్యాంగాన్ని క్రికెట్ రంగంలోనూ అమలు చేస్తున్నారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డినుద్దేశించి ట్విట్టర్‌లో మంగళవారం మండిపడ్డారు. స్వయంకృషితో ఎదిగి ప్రతిభ కలిగిన క్రీడాకారులతో రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. ఒకవైపు పెట్టుబడులను పొరుగు రాష్ట్రాలకు తరిమేసి...రాష్ట్రంలో నిరుద్యోగం పెంచేశారని, మరోవైపు క్రీడాకారుల విషయంలోనూ ఇదే వైఖరి అలంబించడం సమంజసమేనా అని ఆయన ప్రశ్నించారు. క్రికెట్ క్రీడాకారుడు విహారికి తక్షణమే క్షమాపణ చెప్పి తిరిగి కెప్టెన్సీని అప్పగించి రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తోడ్పాడాలని డిమాండ్ చేశారు. విహారి కోనసీమనుంచి వచ్చి ఓ మ్యాచ్‌లో 302 నాటౌట్‌తో నిలిచిన గొప్ప ఆటగాడన్నారు. వైసీపీ నీచ రాజకీయాలలతో ఆయనను ఆంధ్రా జట్టు నుంచి వైదొలిగేలా చేశారని పేర్కొన్నారు. మొత్తం ఏసీఏని గుప్పెట్లోకి పెట్టుకొని అక్రమాలకు తెగబడుతోందని, అధికార దుర్వినియోగంతో హనుమ విహారిని కెప్టెన్సీ నుంచి తప్పించడం దారుణమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం లేని చోట ఉండలేనంటూ భవిష్యత్‌లో ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఆడనని విహారి చెప్పే దుస్థితికి తీసుకొచ్చారన్నారు. గతంలో అంబటి రాయుడు, ఇప్పుడు హనుమ విహారి దిగ్గజ ఆటగాళ్లను అవమానించడమే ఈ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని తెలిపారు. ఆంధ్ర రంజీ జట్టుకు ఎన్నో విజయాలు అందించిన హనుమ విహారి భవిష్యత్‌ను మీ రాజకీయ పెత్తనంతో కాలరాశారని పేర్కొన్నారు. విహారికి తక్షణమే క్షమాపణలు చెప్పి తిరిగి కెప్టెన్సీ ఇచ్చి క్రీడాభివృద్ధికి తోడ్పాడాలని డిమాండ్ చేశారు.

గంజాయి పట్టుబడిన వ్యవహారంలో ఇద్దరు ఏయూ విద్యార్థుల సస్పెన్షన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కలకలం రేపిన గంజాయి వ్యవహారంలో ఇద్దరు విద్యార్థులను అధికారులు సస్పెండ్ చేశారు. వర్సిటీలోని ఏడుగురు విద్యార్థుల నుంచి అనుమానిత ప్యాకెట్‌ను గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారంలో భాగస్వాములైన ఇద్దరు ఏయూ విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా వర్సిటీలోని పలు వసతిగృహాలను పోలీసులు సోమవారం రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు తనిఖీ చేశారు. వర్సిటీ అధికారుల అనుమతితో ఈ తనిఖీలు జరిగినట్టు చెబుతున్నారు.

దుర్గాలమ్మ గుడి ఉత్సవాలను సజావుగా జరిగేలా చూడాలి

- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 27: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి మహోత్సవాలను సజావుగా జరిగేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ ఆదేశించారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన మంగళవారం ఆలయం వద్ద సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మార్చి 7 వతేదీనుంచి 9 తేదీ వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ జాతరకు సంబంధించి ఏర్పాట్లపై చర్చించారు. అమ్మవారి దర్శనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూర్ణామార్కెట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించాన్నారు. అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్, పారిశుధ్యం నిర్వహణపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆలయ ఆవరణలో ఉత్సవాల రోజుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయశాఖ సహాయకమిషనర్, ఉత్సవ కమిటీ అధికారి కె.శిరీష మాట్లాడుతూ, ఈ జాతర మహోత్సవాలు మార్చి 7 తేదీన పందిరిరాటతో ప్రారంభమవుతాయన్నారు. 8వ తేదీన శివరాత్రి పర్వదినం సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకుంటారన్నారు. క్యూల్లో మంచినీరు, ఇతర వసతుల కల్పనకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. 9 తేదీన దుర్గాలమ్మ జాతర మహోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. సమావేశంలో గుడి ఈవో శేఖర్‌బాబు,. దర్మకర్తలమండలి చైర్మన్ మల్లిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష తదితరులు

పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 27: వాల్తేరు డివిజన్ పరిధిలోని బ్రహ్మపూర్, నౌపడ సెక్షన్‌లో ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 29వతేదీన పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. ఆ రోజు భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) గంట 25 నిమిషాలు, హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) గంటా 15 నిమిషాలు, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ ఎ క్స్‌ప్రెస్ (12830) ఐదు గంటల 25 నిమిషాలు, విశాఖ-డిఘా ఎక్స్‌ప్రెస్ (22874) గంటా 45 నిమిషాలు, విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526) రెండు గంటలు ఆలస్యంగా నడుస్తాయన్నారు. అలాగే, పూరి-గుణుపూర్ ఎక్స్ ప్రెస్ (18417) మూడు గంటల 45 నిమిషాలు, గుణుపూర్- రూర్కెలా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18118) గంట 35 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతాయి. కామాక్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12552), ముంబై- భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (22802) రైళ్లను 20 నుంచి 30 నిమిషాలపాటు నియంత్రించనున్నారు. భద్రతను పెంపొందించడానికి చేపడుతున్న నిర్మాణ పనులకు ప్రయాణికులు సహకరించాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా చంద్రమౌళి

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) చైర్మన్‌గా సనపల చంద్రమౌళి నియమితులయ్యారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సనపల చంద్రమౌళి వైసీపీ ఆవిర్భావం నుంచి సేవలు అందిస్తున్నారు. మాధవధారకు చెందిన ఆయన గతంలో వార్డు వైసీపీ అధ్యక్షునిగా, ఉత్తర నియోజకవర్గం కన్వీనర్‌గా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ అధినాయకుల ఆదేశాల ప్రకారం త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 27: నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఏఎస్ఆర్ నగర్, వైఎస్సార్ నగర్, చిట్టిబాబు కాలనీ, ఏపీ టిడ్కో ఇళ్ళు, సంతోషిమాత కాలనీల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అందుకోసం వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మురుగునీటితో అవస్థలు

మాధవధార, ఫిబ్రవరి 27; గ్రేటర్ 51 వార్డు మాధవధార్డులోని సీతన్న గార్డెన్స్‌లో ఓఇంటి ఎదుట ఏడు నెలలుగా కాలువ నీరు నిలిచిపోయి దుర్వాసన నెలకొంటోంది. ఇంటి ఎదుట ఉన్న కల్వర్టు దిగువగా ఉండడంతో కాలువలో నీరు నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సమీప ఇంటి యజమాని భాస్కరరావు, పరిసరాల్లో వారు పలు మార్లు వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. దోమలు వృద్ధి చెంది ఇళ్లల్లో కుటుంబ సభ్యులు వ్యాధుల బారిన పడుతున్నామని మొరపెట్టుకున్నారు. అయినా, సచివాలయ సిబ్బంది పట్టించుకోలేదు. కోట్ల రూపాయలతో కనీస నాణ్యత లేని రోడ్లు వేసుకుపోతున్న జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి గానీ, వార్డు శానిటరీ అధికారికి గానీ ఈ సమస్య పరిష్కారానికి మొగ్గు చూపడంలేదని వాపోతున్నారు. ఇకనైనా, అధికారులు క్షేత్రస్థాయి లో పర్యటించి చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



సీతన్న గార్డెన్స్‌లో ఓ ఇంటి ఎదుట నిలిచిన మురుగు

మాక్ డ్రిల్లేనట!

... 5వ పేజీ తరువాయి

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని చెప్పడం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఈ ప్రాజెక్టు పర్యాటకులను ఆకట్టుకునేదే.. అందులో అనుమానం లేదు. కానీ సురక్షితమైన ప్రాంతంలో ఏర్పాటుచేయాల్సిన దానిని ప్రమాదాలు జరిగే చోట పెట్టడమే ఏమిటనే దానిపైనే అభ్యంతరాలన్నీ. ఎక్కడో ఓ చోట పెట్టేసి చేతులు దులిపేసుకోవాలని అన్నట్టుగానే ఉంది అధికారుల తీరు. పౌర్ణమి అని, అలల తీవ్రత అని ఈ ప్రాజెక్టును నెలకు ఎన్నిసార్లు మూసేస్తారో కూడా అధికారులు చెప్పాల్సి ఉంటుంది. అధికారులు పలు అంశాల్లో తప్పులను ఒప్పుకోకుండా సమర్థించుకోవడం నగర ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇందులో అత్యుత్సాహం లేదని నిరూపించుకోవాలంటే...ఈ ప్రాజెక్టును ఆర్‌కే బీచ్‌లో పెట్టాలని సూచించిన నిపుణులు ఎవరో చెప్పాలి. అధికారికంగా తీసుకున్న అనుమతులు ఏమిటో మీడియాకు వివరించాలి.

'ఉక్కు'లో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

అడ్డుకున్నారు. దీంతో కార్మికులు అడ్మిన్ గేటు వద్ద బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. గేటు బయట, డైరెక్టర్ ఛాంబర్ వద్ద నాయకులు, కార్మికులు నిరసన కొనసాగిస్తున్నారు. 42 ఏళ్ల ఉక్కు చరిత్రలో రాత్రి సమయంలో ఉద్యోగులు/కార్మికులు ధర్నాకు దిగడం ఇదే మొదటిసారి. డైరెక్టర్ (పర్సనల్) కార్యాలయం వద్ద ఆందోళన తెలియజేస్తున్న కార్మిక నాయకులకు మద్దతుగా ఉద్యోగులు (రాత్రి 'సి' షిఫ్టునకు వెళ్లేవారు) మెరుపు ధర్నాకు దిగారు. అదేవిధంగా 'బీ' షిఫ్టునకు వెళ్లిన ఉద్యోగులు రాత్రి 10.30 గంటలకు బయటకు వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. యాజమాన్యం స్పందించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుందని హెచ్చరించారు. రాత్రి 12 గంటలకు కూడా ధర్నా కొనసాగుతూనే ఉంది. ఉక్కు సీఎండీ బయటకు ఒకటి చెప్పి, మరొకటి అమలు చేస్తున్నారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, జి.గణపతిరెడ్డి, బీఎంకే నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ నిల్

... 5వ పేజీ తరువాయి

ఎన్‌ఓసీ పొందారు. అయితే ఆ గడువు ఐదు నెలల కిందటే ముగిసింది. ఎన్‌ఓసీ రెన్యువల్ కోసం భవన యజమాని జీవీఎంసీ ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఒకరు అక్కడకు వెళ్లి భవనంలో అగ్ని ప్రమాద నివారణ వ్యవస్థతోపాటు మోటార్లు, స్మోక్ డిటెక్టర్లు, వాటర్ స్ప్రేయింగ్ వాల్వ్‌లతోపాటు ఇతర పరికరాల పనితీరును పరిశీలించారు. ఇంటర్నల్ ఫైర్ ఫైటింగ్ సిస్టమ్‌తోపాటు కొన్ని పరికరాలు సరిగా పనిచేయడం లేదని గుర్తించారు. దీంతోపాటు ఫైర్ ఫైటింగ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించడం, ప్రతి మూడు నెలలకు ఒకసారి మాక్ డ్రిల్ నిర్వహణ, పరికరాల పనితీరును తరచూ పరీక్షించేందుకు వీలుగా ఫైర్ సేఫ్టీ అధికారిని నియమించుకోవాల్సి ఉన్నా...అలా చేయకపోవడంతో ఎన్‌ఓసీ జారీకి నిరాకరించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. అన్నింటినీ సరిచేసిన తరువాతే ఎన్‌ఓసీ జారీచేస్తామని స్పష్టంచేశారు. కానీ ఎస్ఎఫ్ఓ హెచ్చరికలను భవన యజమాని తేలిగ్గా తీసుకున్నారు. తనిఖీకి వచ్చిన అధికారి సూచించిన రిమార్కులను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదాన్ని మొదట్లోనే కొంతమంది గుర్తించి భవన యజమానితోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ మంటలను సకాలంలో ఆర్పలేకపోయారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు వ్యాపించడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లడానికి కారణమైంది. అదే భవనంలో అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ పనిచేసి ఉంటే ప్రాథమిక దశలోనే మంటలను ఆర్పేందుకు వీలుండేదని అగ్నిమాపక శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపిన తర్వాత లోపాలు నిర్ధారణ అయితే భవన యజమానికి నోటీసులు జారీచేస్తామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.రేణుకయ్య తెలిపారు.

29లోగా ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలి

భీమునిపట్నం, ఫిబ్రవరి 27: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటి నుంచి 4వ వార్డులలో డీఅండ్ ఓ ట్రేడ్ లైసెన్సు రుసుం ఈనెల 29వ తేదీలోగా వ్యాపారులు చెల్లించాలని జోనల్ అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనను ఆయన విడుదల చేశారు. గడువులోగా చెల్లించని వారు ప్రస్తుతం చెల్లిస్తున్న లైసెన్స్‌లపై 25 శాతం అదనపు రుసుంతో వసూలు చేస్తామన్నారు. వ్యాపారాలకు సంబంధించిన కమర్షియల్ ట్యాక్స్ నుంచి పొందిన లైసెన్స్‌ల రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

ఆరేళ్ల నిబంధనతో విద్యా వ్యవస్థకు నష్టం

మధురవాడ, ఫిబ్రవరి 27: ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు ఆరేళ్లు నిండాలనే నిబంధన సడలించాలని పలు వర్గాలు కోరుతున్నాయి. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) ఆర్టీఈ చట్టం 2009 ప్రకారం ఒకటో తరగతిలో చేరడానికి బాలబాలికలకు ఆరేళ్లు నిండాలని కేంద్రం రాష్ట్రాలకు లేఖలు రాయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో జీఓ నంబరు 117 అమలుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కనిష్ఠ స్థాయికి చేరుకుందని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆరేళ్లు నిండిన వారికే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తామంటే అసలు ఆ తరగతిలో ప్రవేశాలే ఉండవన్నారు. 5 ప్లస్ పిల్లలను ఒకటో తరగతిలో చేర్చుకోవాలని సూచిస్తున్నారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉండడం వల్ల కేంద్రం మన రాష్ట్ర విద్యావ్యవస్థకు సూచనలు చేసిందని, అదే ఆదేశం కాదని చెబుతున్నారు. ఈ అంశంపై మేధావులు, విద్యావేత్తలు, రాజకీయవేత్తలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

గీతంలో బయోటెక్నాలజీపై అవగాహన

సాగర్‌నగర్, ఫిబ్రవరి 27: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28వ తేదీన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దేశీయ సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రెండురోజులపాటు సాగే ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) శిక్షణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన డిగ్రీ కళాశాలల నుంచి అధ్యాపకులు హాజరయ్యారు. సైన్స్ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎం.కృష్ణ, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడారు.

2 నుంచి కోర్టు ఫైలింగ్‌పై వర్క్‌షాప్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 27: న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులకు క్లినికల్ లీగల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్‌లా ఆధ్వర్యంలో మార్చి 2 నుంచి 4 వరకు కోర్టు ఫైలింగ్ ప్రత్యేక వర్క్‌షాప్, శిక్షణ నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ డాక్టర్ ఆర్.అనితారావు తెలిపారు. న్యాయస్థానంలో సమర్పించే రికార్డులు, పద్ధతులు, దరఖాస్తులపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈనెల 29లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

పద్మనాభం(రూరల్), ఫిబ్రవరి 27: మండలంలో మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శైలజ కోరారు. మంగళవారం వెలుగు భవనంలో వివిధ శాఖల అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వప్న మాట్లాడుతూ మండలంలో మార్చి 3,4,5, తేదీల్లో వివిధ గ్రామాల్లో 43 కేంద్రాలను ఏర్పాటు చేసి, 3,292 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఇందుకు 86 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథలకు సరకుల వితరణ

ఆరిలోవ: పాత డైరీ ఫారానికి సమీపంలోని ఆనంద్ మార్గ్ అనాథ పాఠశాలకు వరల్డ్ ఎన్జీవోడే సందర్భంగా చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ఇండియా నిత్యావసర సరకులను అందజేసింది.కార్యక్రమంలో సంస్థ అడ్మిన్ నీలి సుబ్బలక్ష్మి, ప్రతినిధి ఆర్‌పి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 32, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 28, క్యారెట్ 22, దొండకాయలు 32, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 110, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 42, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28, కంద 64, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ]లో..

పాఠశాలల్లో ఐబీ సిలబస్ అమలుపై పరిశీలన

» జిల్లా విద్యా శిక్షణ సంస్థ, పాఠశాలలను సందర్శించిన సభ్యులు



భీమిలి డైట్‌లో ఐబీ టీమ్ సభ్యులు, విద్యాశాఖాధికారులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 27: స్థానిక ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)ను మంగళవారం ఇంటర్నేషనల్ బక్లారియేట్ ఐబీ సంస్థ, మెక్సికో ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో త్వరలో ప్రారంభించనున్న ఐబీ సిలబస్‌పై పలు అంశాలను ఐబీ సంస్థ ప్రతినిధులు ఆల్గో, మైకేల్‌లు డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, డీఈవో ఎల్.చంద్రకళను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ, పాఠశాల విద్య బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను, ఇంగ్లీష్ మీడియం, టోఫెల్ తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల వివరాలు, ఉపాధ్యాయులకు ఇస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాలపై వివరించారు. అనంతరం, ఐబీ ప్రతినిధులు డైట్ ప్రిన్సిపాల్, అధ్యాపకులను పలు ప్రశ్నలు వేసి బోధన తీరుతెన్నులను ఆకళింపు చేసుకున్నారు. డైట్ ఛాత్రోపాధ్యాయుల అభిప్రాయాలను రికార్డు చేసుకున్నారు. విద్యాశాఖ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, వివిధ విద్యా కార్యక్రమాలు, విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం, భీమిలి పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాలను, పండిట్ నెహ్రూ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో బోధన జరుగుతున్న తీరు, సైన్స్ ల్యాబ్‌ను, లైబ్రరీని పరిశీలించారు. ఆరో తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్ భాష అభివృద్ధి ఏ విధంగా ఉంది.. విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ కేశిరాజు శ్రీనివాస్, సమగ్ర శిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, డైట్ వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, ఎంఈవో ఎం.శివరాజి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎంపీ, తదితరులు

వెంకోజీపాలెం/ మద్దిలపాలెం, ఫిబ్రవరి 27: శిథిలావస్థలో ఉన్న మురుగునీటి పైపులైన్లను పునరుద్ధరణకు శంకుస్థాపన చేశామని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మంగళవారం మూడవ జోన్ 23వ వార్డు పరిధి మద్దిలపాలెం, చైతన్యనగర్, కేఆర్ఎం కాలనీ, ప్రియదర్శిని కాలనీ తదితర ప్రాంతాలలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో శిథిలావస్థలోని పైపులైన్లు మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా 23వ వార్డులో సుమారు రూ.77.20 లక్షల వ్యయంతో పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ల సత్యారెడ్డి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎంపీ శ్రీకారం

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు బీఎస్ఆర్ నగర్, తోటగరువు గల వరసిద్ధి వినాయక, దుర్గ, పోలమాంబ ఆలయ అభివృద్ధికి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రూ.20 లక్షలు అందించారు. ఈ మేరకు మంగళవారం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బొండా శ్రీనివాసు, కన్నబాబు, మొల్లి హేమంత్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వయో వృద్ధుల ఉపకరణాలకు పేర్లు నమోదు



పేర్లు నమోదు చేస్తున్న అలింకో ప్రతినిధులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 27: రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకంలో భాగంగా మంగళవారం పెదజాలారిపేట జీవీఎంసీ పాఠశాలలో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచితంగా పంపిణీ చేసే ఉపకరణాలకు పేర్లు నమోదు చేపట్టారు. ప్రభుత్వ వయో వృద్ధుల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమాధికారి జి.మాధవి, జీవీఎంసీ ఏపీడీ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో ఉపకరణాలు అందజేస్తుందన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కళ్ల జోళ్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, ఊత కర్రలు, చంక కర్రలు, కృత్రిమ దంతాలు, ట్రైపాడ్స్ అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులు తెల్ల రేషన్ కార్డు నకలు, ఆధార్ కార్డు నకలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. బుధవారం పోర్టు స్టేడియంలో శిబిరం జరుగుతుందన్నారు. వయో వద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, అలింకో ప్రతినిధులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

'ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలి'



తగరపువలసలో దళిత నాయకుల సమావేశం

తగరపువలస, ఫిబ్రవరి 27: ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వినియోగించాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. తగరపువలసలో మంగళవారం సామంతుల సత్తిరాజు అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు కేటాయించిన నిధులు వారికే వినియోగించాలని డిమాండ్ చేశారు. అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చుతున్నట్టు ఆరోపించారు.అత్యాచారాలకు గురవుతున్న ఎస్సీలకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ సమావేశంలో అయినాపురం రవి, న్యాయవాది గంధవరకు కృష్ణ, భోగాపురం నాయకులు మామిడి వెంకట శివ, సోమి వెంకట్, టొంపల సూరిబాబు, అక్కవరపు మోహనరావు తదితరులు మాట్లాడారు. వివిధ తీర్మానాలకు ప్రవేశపెట్టారు. కొండపేట వద్ద అంబేద్కర్ భవన్‌లో ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.

చలో తాడేపల్లిగూడెం విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరించిన జనసేన నాయకులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 27: తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి భారీ బహిరంగసభ తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్నారని ఈ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన బహిరంగ సభ జెండా, చలో తాడేపల్లి గూడెం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వైసీపీ విముక్తి రాష్ట్రమే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తెలుగు తమ్ముళ్లు, జనసైనికులతో తాడేపల్లి దద్దరిల్లాలన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రతిపత్తిపాడు గ్రామం ఆటోనగర్‌లో బుధవారం జరిగే భారీ బహిరంగసభకు ఉత్తరాంధ్ర నుంచి భారీ సంఖ్యలో జనసైనికులు కదలాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మారెడ్డి శివశంకర్, ఇన్‌చార్జులు పసుపులేటి ఉషాకిరణ్, శివప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్లు కందుల నాగరాజు, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ, ఫిబ్రవరి 27: స్థానిక శ్రీ సత్యసాయి విద్యావిహార్ పాఠశాల కిండర్ గార్డెన్ స్నాతకోత్సవం మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ అయ్యగారి కౌసల్య, ప్రత్యేక అతిథి డాక్టర్ ఎస్.వి. కళ్యాణి పొన్నగంటి, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు, పాఠశాల గవర్నింగ్ బాడీ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణవీర్ అభిషేక్‌కు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అభిషేక్

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 27: ప్రపంచ ఎన్జీవో దినోత్సవం సందర్భంగా బాషావేత్త, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ తరపున మెడికవర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామమూర్తి అవార్డును ప్రదానం చేశారు. విద్యార్థులకు ఆంగ్లభాష, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అందించినందుకు అభినందించారు. వరుణ్ హెల్త్ సెంటర్స్ వైస్ ప్రెసిడెంట్ బంగార్రాజు, బ్రహ్మకుమారి రామేశ్వరి, ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మణిభూషణ్, గోవిందరావు పాల్గొన్నారు.

బాలికలు చదువుకుంటేనే అసమానతలు దూరం



సదస్సులో మాట్లాడుతున్న జీసీడీఓ

పద్మనాభం, ఫిబ్రవరి 27: బాలికలు విద్యావంతులైతే అసమానతలు దూరమవుతాయని బాలికా విద్యాభివృద్ధి అధికారి (జీసీడీఓ) డాక్టర్ కాలేషాబేగం అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో బేటీ పడావో-బేటీ బచావోపై మంగళవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాలికల భద్రత, మానవ అక్రమ రవాణా నిరోధానికి చట్టాలున్నాయన్నారు. ఐసీడీఎస్ పీఓ శ్రీదేవి, ఏపీఓ నీలిమ, సూపర్‌వైజర్ రాజేశ్వరి, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో హర్షాతిరేకాలు'



టీడీపీ మేనిఫెస్టో ప్రతులను ప్రదర్శిస్తున్న నాయకులు

పద్మనాభం(రూరల్), ఫిబ్రవరి 27: పార్టీ అధినేత చంద్రబాబు రూపకల్పన చేసిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ మాజీ మండల అధ్యక్షులు కాళ్ల నగేశ్ కుమార్ అన్నారు. మంగళవారం అనంతవరం, తునిపొలం గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. ఎస్సీఎస్టీ, బీసీల్లో రాజకీయ చైతన్యం టీడీపీతోనే వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎస్.రమణమ్మ, వెంకటరావు, అప్పల సూర్యనారాయణ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

36 కిలోల గంజాయిని పట్టుకున్న ఆరిలోవ పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

ఆరిలోవ, ఫిబ్రవరి 27: ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధి ముడసర్లోవ డంపింగ్ యార్డు సమీపంలో 36 కిలోల గంజాయిని పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు... కారులో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో ఆరిలోవ సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి ముడసర్లోవ డంపిగ్‌యార్డు వద్ద మాటు వేశారు. వేగంగా వస్తున్న నిసాన్ కారును ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి బయటపడింది. కాగా కారు డ్రైవర్ పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయాడు. కారులోఉన్న ఢిల్లీకి చెందిన సంజయకుమార్‌సింగ్ నుంచి 18 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇది మొత్తం 36 కిలోలు ఉందని తేలింది. పట్టుబడిన నిందితుడ్ని చినగదిలి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి, కేసు నమోదు చేశారు. గంజాయి తరలిస్తున్న కారును, నాలుగు సెల్‌ఫోన్లు, రూ3,070 నగదు స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకుని పారిపోయిన కార్ డ్రైవర్ గురించి గాలింపు చర్యలు చేపట్టామని సీఐ వివరించారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణోత్సవం

సింహాచలం, ఫిబ్రవరి 27: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిని ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు షోడశోపచారాలు సమర్పించారు. కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు చేసి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు.

అంగరంగ వైభవంగా గరుడసేవ

సింహాచలం: గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. షోడశోపచారాలతో పూజలు చేసి నృసింహ అష్టోత్తర శతనామవళితో అర్చించారు. మంగళవాయిద్యాలు వెంటరాగ, భక్తులు స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మంగళనీరాజనాలిచ్చి శీతలం(పంచదార) నివేదనలు చేసి భక్తులకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇంటర్ విద్యార్థుల పూజలు

సింహాచలం: పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు వరాహలక్ష్మీనృసింహుని మంగళవారం దర్శించుకున్నారు. నగరంలోని పలు కాలేజీలకు చెందిన విద్యార్థులు కొండదిగువ తొలి పావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టి కాలినడకన మెట్లమార్గంలో నడచి సింహగిరికి చేరుకున్నారు. అప్పన్నను దర్శించుకుని పరీక్ష హాల్‌టికెట్లను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని మొక్కుకున్నారు.



నిత్య కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



తొలి పావంచా వద్ద పూజలు చేస్తున్న ఇంటర్ విద్యార్థులు